క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి

రాజాం: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సోమవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరుకావాలని కోరారు.

తెర్లాం: మండల కేంద్రంతో పాటు మండలంలో వైఎస్సార్ విగ్రహాలు ఉన్న అన్ని గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం ఫీడర్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్‌పై తొండ పడడంతో ఆ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న సిబ్బంది, అక్కడికి చేరుకుని మరమ్మతుల అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వీరఘట్టం మండలంలోని వండువ సమీపంలో 33 కేవీ లైన్ మరమ్మతుల అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఏఈ కె.వినయ్ కుమార్ తెలిపారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు



బోరు బాగుచేస్తున్న మెకానిక్ కృపారావు

వంగర: మండల పరిధిలోని కింజంగి గ్రామంలో పాడైన రెండు తాగునీటి బోర్ల మరమ్మతులు ఆదివారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. రజకవీధి, ఆంజనేయ మందిరం సమీపంలోని బోర్లు గత కొంతకాలంగా పనిచేయకపోగా వాటిని మెకానిక్ కళింగ కృపారావు బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

ఘనంగా రథయాత్ర



మందిరంలో రథాన్ని లాగుతున్న భక్తులు

రాజాం సిటీ: స్థానిక బాబానగర్‌లోని సత్య సాయి శివం మందిరంలో రథయాత్ర ఘనంగా ఆదివారం ప్రారంభమైంది. పూరీ జగన్నాథ స్వామి రథయాత్ర తరహాలో రథంలోకి బలరాముడు, జగన్నాథుడు, సుభద్రాదేవిలను తోడ్కొని వచ్చి, పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగారు. ఈ నెల 18వ తేదీ వరకు ఈ రథయాత్ర ఉత్సవాలు జరుగుతాయని, 15వ తేదీన తిరుగు రథయాత్ర చేపట్టనున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాజగోపాలరావు, ఆచారి, శ్రీనివాసరావు, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేశతల్లి వారాల పండగ



రామభద్రపురంలో దేశతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని చొక్కాపు వీధి, చింతల వీధి వాసులు దేశతల్లి వారాల పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులంతా కలశాలలతో తీన్‌మార్ వాయిద్యాల నడుమ గ్రామ పొలిమేరలకు వెళ్లి, అమ్మవారికి పరమాన్నం, చీరలు, పసుపు, కుంకుమ, కోళ్లు చూపిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడి, పాడిపంటలు బాగా పండాలని వేడుకున్నారు.

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే బేబీ నాయనకు వినతిపత్రం అందిస్తున్న సీఏపీఎఫ్ సభ్యులు

బొబ్బిలి: స్థానిక కోటలో ఎమ్మెల్యే బేబి నాయనను సీఏపీఎఫ్(సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్) సభ్యులు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. బీఎస్‌ఎఫ్ తరహాలో ఆర్మీ రిటైర్డ్ మెన్‌కు అందించే రిటైర్‌మెంట్, క్యాంటీన్, సైనిక్‌బోర్డు, వైద్యం, ఎక్స్ కోటా, తదితర ప్రయోజనాలను తమకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను వారు కోరారు. అంతకుముందు ఎమ్మెల్యే వారు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘ స్టేట్ కో–ఆర్డినేటర్ వి.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ

రేగిడి:

మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కల పెంపకానికి ముందుకురావాలని సత్యసాయి భజన మండలి రాజాం స్టడీ సర్కిల్ ఇన్‌చార్జ్ వి.వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని రేగిడి గ్రామంలో సత్యసాయి భక్తులతో కలిసి ఆయన మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ప్రతీ గ్రామంలోని సత్యసాయి భక్తులు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యతలు తీసుకోవాలన్నారు. అలాగే యువత కూడా తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. సామాజిక అడవుల పెంపకం ద్వారానే ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని, తద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజాం: పొగిరి పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థి

రాజాం: మొక్కలు నాటడమనేది ప్రతీ ఒక్కరి సామాజిక బాధ్యతగా పరిగణించి, నిర్వర్తించాలని పొగిరి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శాసపు సత్యనారాయణ అన్నారు. అదే పాఠశాలలో అదే పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి దయాసాగర్ తన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మొక్కలు నాటడాన్ని ఆయన, సిబ్బంది అభినందించారు. విద్యార్థులంతా ఈ సంప్రదాయాన్ని పాటించాలని, పర్యావరణ పరిరక్షణకు మనవంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు పాల్గొన్నారు.

బొబ్బిలి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎమ్మెల్యే బేబి నాయన(ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు అన్నారు. స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్, కోశాధికారి వి.ఎస్.శర్మల ఆధ్వర్యంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. మొక్కల పెంపకానికి ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు రూ.5 వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాస్, గోవిందనాయుడు, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు. బొబ్బిలిలోని బీసీ వసతిగృహాన్ని మండలంలోని కోమటిపల్లికి మార్చిన కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మళ్లీ పట్టణంలోనే బీసీ వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.



బొబ్బిలి: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బేబి నాయన



రేగిడిలో మొక్కలు నాటుతున్న సత్యనారాయణ, తదితరులు

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు అన్నారు. స్థానిక విశ్వసాయి మందిరంలో విద్యార్థులకు ఉచిత ధ్యాన యోగా తరగతులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు యోగా ప్రాధాన్యతను వివరించడంతో పాటు ధ్యానం ద్వారా ఆయుష్షు పెంచుకునే పద్ధతులు తెలిపారు. ప్రతిఒక్కరూ ధ్యానం చేసుకోవాలన్నారు. అనంతరం నైతిక వికాసంపై పలువురు వక్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ధ్యానం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న వక్తలు

ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

రాజాం: ఎంఆర్‌పీఎస్ సామాజిక పోరాటాలకు 30 ఏళ్లు దాటాయని రాజాం నియోజకవర్గ ఎంఈఎఫ్ అధ్యక్షులు అరసాడ ఆనందరావు మాదిగ, ఏపీ రాష్ట్ర నాయకులు యందవ నారాయణరావులు అన్నారు. స్థానిక పట్టణంలోని మాదిగ వీధిలో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ తన 30 సంవత్సరాల సుధీర్ఘ సామాజిక పోరాటంలో కేవలం మాదిగల కోసమే కాకుండా అణగారిన వర్గాలు అందరికీ అన్ని హక్కులు కల్పించేందుకు ప్రయత్నించిందన్నారు. వృద్ధులు, వితంతవులు, గుండెజబ్బుల పిల్లల జీవితాల్లో ఆశాదీపాలు నింపేందుకు జాతీయ స్థాయిలో ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు, మాదిగ విద్యార్థి నాయకులు, మాదిగ కుల పెద్దలు, ఎంఈఎఫ్ కోశాధికారి అరసాడ బోసు మాదిగ, బి.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలు

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో పుస్తకాలు ఏ విధంగా చదవాలో నేర్పించారు. అనంతరం లైబ్రేరియన్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఎక్కువగా పుస్తకాలు చదవాలని, సెల్‌ఫోన్ వాడకానికి విద్యార్థులు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్ వాడితే జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని తెలిపారు. విద్యార్థులంతా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని, చిల్డ్రన్స్ క్లబ్ చేరిన విద్యార్థులకు ఏమేమి ఉపయోగాలు ఉన్నాయో తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలపై తర్ఫీదు ఇచ్చారు.



విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు

బొబ్బిలి: పట్టణ సమీపంలోని గ్రోత్ సెంటర్ దగ్గరున్న తెల్లచెరువులో గ్రావెల్ తవ్వకాలు ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. ప్రతిరోజూ 10 ట్రాక్టర్లతో గ్రావెల్ తవ్వకాలు చేసి, తరలిస్తున్నారు. మండలంలోని దిబ్బగుడివలస సమీపంలోని చెరువులో శుక్రవారం రాత్రి గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న విషయం తెలుసుకున్న ఆర్‌డీవో సాయిశ్రీ, డీఎస్పీ శ్రీనివాసరావు సిబ్బందిని పంపించి, తవ్వకాలను అడ్డుకున్నారు. ఐదు ట్రాక్టర్లు, ఓ ప్రొక్లెయినర్‌ను స్వాధీనం చేసుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే ఆ తర్వాత వాటిని విడిచిపెట్టినట్లు సమాచారం. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే(శనివారం) పట్టణ పరిసరాల్లో గ్రావెల్ తవ్వకాలు జోరుగా జరిగాయి. ఆదివారం కూడా అధికారులకు సెలవుదినం కావడంతో గ్రావెల్ తరలింపును అక్రమార్కులు వేగవంతం చేశారు. ఓ చోట జరిగిన అక్రమ తవ్వకాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే, అక్కడ ఆ తవ్వకాలు ఆపి, మరోచోట అక్రమార్కులు తవ్వకాలు చేపడుతుండం విశేషం. ఇటీవల కాలంలో గ్రావెల్ దందా బాగా పెరిగిపోయిందని పలువురు చెబుతున్నారు.



గ్రోత్ సెంటర్ చెరువు వద్ద గ్రావెల్ తరలింపు కోసం ఉంచిన ట్రాక్టర్లు

చురుగ్గా పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని ఎస్.బూర్జవలస గ్రామంలో సర్పంచ్ నీలమ్మ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామంలోని అన్ని వీధుల కాలువల్లోని చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు పూడికలు తొలగించారు. అలాగే బోరుబావుల పరిసరాల్లో బ్లీచింగ్ చల్లుతున్నారు. దోమలు పెరగకుండా దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి దీపక్ తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కాచివడపోసిన నీటినే తాగాలన్నారు.

రాజాం: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. గురవాం, సోపేరు, రాజయ్యపేట తదితర గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులపై ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఆరాతీశారు. పంచాయతీ నిధుల ద్వారా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో తెలిపారు. పెంటకుప్పలు, చెత్త నిల్వలు తొలగించడంతో పాటు మురుగు కాలువల్లో చెత్త, పూడికలు తొలగిస్తున్నామన్నారు.



రాజాం: గురవాంలో ప్రొక్లెయిన్ సహాయంతో పూడికలు తీస్తున్న దృశ్యం



తెర్లాం: ఎస్.బూర్జవలస వీధి కాలువలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికుడు

దారికాచి బంగారం దోపిడీ

బొబ్బిలి రూరల్: ఓ మహిళపై గుర్తుతెలియని వ్యక్తి భౌతికదాడికి పాల్పడి, ఆమె ధరించిన బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన కారాడ(బొబ్బిలి మండలం), ఆనవరం(బాడంగి మండలం) గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. బాడంగి మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన సిరికి పార్వతి ఉదయం తన కన్నవారి ఊరు అయిన బొబ్బిలి మండలంలోని కారాడకు వెళ్లింది. సాయంత్రం ఆమె తిరిగి తన స్వగ్రామానికి కాలినడకన బయలుదేరింది. సరిగ్గా కారాడ, ఆనవరం గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు వద్దకు వచ్చేసరికి అప్పటికే కాపుకాసి ఉన్న దుండగుడు ఆమెను అడ్డగించి, పెద్దరాయితో ఆమె ముఖంపై దాడిచేశాడు. ఆ షాక్ నుంచి ఆమె తేరుకునేలోగా ఆమె ఒంటిపై ఉన్న నాలుగు తులాల బంగారం పుస్తెలతాడు, చెవిదుద్దులు లాక్కొని పరారయ్యాడు. అనంతరం ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల నుంచి స్థానికులు వచ్చి, ఆమెకు సపర్యలు చేసి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఇదే ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న సీఐ ఎం.నాగేశ్వరరావు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ దారి దోపిడీ ఘటనను సీరియస్‌గా తీసుకున్నామని త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్వతి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ నాగేశ్వరరావు

ఏపీజీఈఏ అధ్యక్షుడిగా శశిభూషణరావు

బొబ్బిలి: ఏపీజీఈఏ(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం) బొబ్బిలి యూనిట్ అధ్యక్షుడిగా డాక్టర్ గేదెల శశిభూషణరావు ఎన్నికయ్యారు. స్థానిక సీహెచ్‌సీలో ఏపీజీఈఏ ఎన్నికలను ఏపీజీఈఏ గజపతినగరం యూనిట్ అధ్యక్షుడు సుధాకర్ పట్నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యదర్శిగా బి.మేరీజాయ్, కోశాధికారిగా బి.అరుణభారతి, సహాధ్యక్షుడిగా శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా జి.సుజాత, జి.నాగరత్నం, సీహెచ్ పైడితల్లి, అల్లు ప్రభాకర్, కె.రామదీపిక, సంయుక్త కార్యదర్శులుగా నల్లి శ్రీనివాసరావు, ఎం.చంద్రశేఖర్, గర్భాపు సురేష్, ఎం.కిరణ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని సంఘ అధ్యక్షుడు శశిభూషణరావు తెలిపారు.



ఏపీజీఈఏ నూతన కార్యవర్గ సభ్యులు

పామాయిల్ సాగుపై రైతుల ఆసక్తి

రేగిడి: మండలంలోని ఖండ్యాం, వెంకటాపురం, కొమెర తదితర గ్రామాల్లో రైతులు పామాయిల్ పంట సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. చాలా గ్రామాల్లోని పామాయిల్ తోటలు ప్రస్తుతం పూత దశకు చేరుకోగా, మరికొన్నిచోట్ల ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీతో కొత్తగా తోటలు వేస్తున్నారు. మూడేళ్ల వయసుకే పంట రావడం, 25 ఏళ్లపాటు పంట వస్తుండడంతో పామాయిల్ సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తుండడం విశేషం.



ఖండ్యాంలో సాగు చేస్తున్న పామాయిల్ పంట

ఖరీఫ్ పనుల్లో రైతు బిజీబిజీ

రేగిడి: ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు బిజీబిజీ అయ్యారు. ఇప్పటికే నారుమడి తయారు చేసుకోగా, వరినాట్లు వేసుకునేందుకు మడులు సిద్ధం చేసే పనిలో అన్నదాతలు ఉన్నారు. ప్రతిచోటా పొలాలకు చేరుకుంటున్న రైతులు, నాగలి, ట్రాక్టర్ల సాయంతో దుక్కి పనులు చకచకా చేస్తున్నారు. మండలంలోని అంబకండి, ఉప్పరనాయుడువలస, చాటాయవలస, వండానపేట, ఉంగరాడ తదితర గ్రామాల్లోని రైతులు ఖరీఫ్ దుక్కుల్లో నిమగ్నమయ్యారు.



నాగలి సాయంతో దుక్కి చేస్తున్న రైతు

‘ప్లాస్టిక్ కవర్లు వద్దు.. కాటన్ సంచులే ముద్దు’



కాటన్ సంచులతో వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక పట్టణంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్లు వద్దు.. కాటన్ సంచులే ముద్దు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పిలుపు మేరకు కాటన్ సంచులు పంపిణీకి చర్యలు చేపట్టామని వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి తెలిపారు. ప్రతి ఒక్కరూ బజారుకు వెళ్లే సమయంలో తమతో పాటు కాటన్‌సంచిని తీసుకువెళ్లాలని, అలా చేస్తేనే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడగలమన్నారు. అనంతరం పలువురికి కాటన్ సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకచర్ల పైడిరాజు, మురపాక గణేష్, గట్టి పాపారావు, డొంక త్రినాధులు పాల్గొన్నారు.

అందుబాటులో పశుగ్రాసం విత్తనాలు

లక్కవరపుకోట: పాడిరైతులకు 75 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు పశుగ్రాసం విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని ఎల్.కోట పశువైద్యాధికారి గాయత్రీదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎస్‌హెచ్–24 ఎంఎఫ్ రకం జొన్న గడ్డి విత్తనాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మండలానికి వచ్చిన టన్ను విత్తనాలను రైతు సేవాకేంద్రాలకు సరఫరా చేశామని స్పష్టం చేశారు. 5 కిలోల విత్తనాల కిట్ ఖరీదు రూ. 460 కాగా రాయితీపై రూ.115కు రైతులకు అందించనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదం.. ఈ ప్రయాణం..



అధిక లోడుతో గాంధీబొమ్మ సెంటరు మీదుగా రాజాం వైపు వెళ్తున్న మినీవ్యాన్

రామభద్రపురం: మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారి గుండా పలు గ్రామాల నుంచి వాహనదారులు మరిమితికి మించిన లోడుతో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. రైస్‌మిల్లుల్లో వరిపొట్టు, పాతసామాన్ల లోడ్లు, ప్లాస్టిక్ డ్రమ్ములు, బిందెలు, ఖాళీ బ్రాంది సీసాలు, తినుబండారాల ప్యాకెట్లు వంటివి ఒకే వాహనంలో పరిమితికి మించి ప్రమాదకర రీతిలో తరలిస్తున్నారు. దీన్ని అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి వాహనాల కారణంగానే జాతీయ రహదారులు, ఇరుకురోడ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని.. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వాపోతున్నారు. పరిమితికి మించి లోడులతో వెళ్తున్న వాహనాలు వేగంలో అదుపు తప్పి ప్రమాదాలు జరిగే సంఘటనలు అనేకం ఉన్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఇటువంటి వాహనాలను అడ్డుకుని, ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.